
సాక్షి
నిజామాబాద్
గురువారం । 24 । అక్టోబర్ । 2024



**ఐక్యతతో ఆనందం**
పోచారం, చిన్నరాంపూర్ తండాలవాసులు కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.
- 8లో ▸



**క్రీడలతో కొత్తదనం**
ఉద్యోగి జీవితంలో క్రీడలతో కొత్తదనం కనిపిస్తుందని అదనపు డీసీపీ కోటేశ్వరరావు అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /20.1

**వాతావరణం**
ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురియవచ్చు. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### మాధవనగర్ రైల్వేగేటు మూసివేత

- నేటి అర్ధరాత్రి నుంచి మూడురోజులు



నిజామాబాద్ రూరల్: నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేటును గురువారం అర్ధ రాత్రి 12 గంటల నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ పునరుద్ధరణ, గేటు వద్ద రోడ్డు మరమ్మతులు చేపడుతుండటంతో ఈ నెల 27 వరకు మూసి ఉంచుతామన్నారు. ఒకవేళ పనులు ఆలస్యం అయితే గేటు మూసివేత ఎక్కువ రోజులు ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనదారులు కంఠేశ్వర్ బైపాస్ మీదుగా వెళ్లాలని సూచించారు.

### కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు ఎనిమిది గేట్ల గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 39,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 25 వేల క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, వరద కాలువ ద్వారా 5 వేలు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు, తాగు మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

**నిజాంసాగర్ మూడు గేట్ల ద్వారా..**
నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు బుధవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 12,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1,404.92 అడుగుల(17.687 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

### గల్ఫ్ బాధిత కుటుంబాలకు సర్కారు అండ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి, అక్కడ అకాల మరణం పొందినవారి కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గల్ఫ్ దేశాలలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించిన సర్కారు.. దీనికి సంబంధించిన నిధులు విడుదల చేసింది. నిజామాబాద్ జిల్లాకు రూ. 1.75 కోట్లు, కామారెడ్డి జిల్లాకు రూ. 20 లక్షలు కేటాయించింది. జగిత్యాలకు రూ. 1.40 కోట్లు, రాజన్న సిరిసిల్లకు రూ.60 లక్షలు, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.


### 29న బీసీ కమిషన్ బృందం రాక

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ బీసీ కమిషన్ బృందం ఈ నెల 29న జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై అభిప్రాయాలను తెలుసుకునేందుకు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించి ఈ నెల 29న నిజామాబాద్ కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతారని వెల్లడించారు. ఆసక్తి గల వారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా అందజేయవచ్చని తెలిపారు. అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను నివేదించవచ్చని తెలిపారు.

# ఇసుక దందాకు ఖాకీల అండ!

ఇసుక దందాను అరికట్టాల్సిన పోలీసులు వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. నెల నెలా మామూళ్లు తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నారు. ట్రాక్టర్‌కు ఇంత అని తీసుకుంటున్నారు. అటువంటి పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

- మామూళ్లు తీసుకొని అక్రమ రవాణాకు పోలీసుల పచ్చజెండా
- కొందరు ఎస్సైలకు ప్రతి నెలా ముడుపులు
- ట్రాక్టర్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు
- అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ ఆదేశాలు
- నెలన్నర గడుస్తున్నా చర్యలు చేపట్టని వైనం



ఖలీల్‌వాడి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నదులు, వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలించి కొందరు రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఇసుకాసురుల ఆట కట్టించాల్సిన పోలీసులు వారితో కుమ్మక్కయ్యారు. దందాను అరికట్టాల్సిన ఖాకీలు ఇసుకాసురుల నుంచి ప్రతి నెల మామూళ్లు తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నారు. ఇలా ఇసుక దందాకు సహకరిస్తున్న జిల్లాలోని పలువురు ఎస్సైలు, సీఐలపై చర్యలు తీసుకోవాలని డీజీపీ జారీ చేసిన ఉత్తర్వులు చర్చనీయాంశం అయ్యాయి. ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో విఫలమైన ఆయా అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఉంది.

**పోలీసులతో ఒప్పందం**
నది పరీవాహక ప్రాంతాలు, వాగులు ఉన్న ప్రాంతాల్లో పని చేస్తున్న ఎస్సైలు, సీఐలు ఇసుక దందా చేసే వారి నుంచి ప్రతి నెలా మామూళ్లు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాన్ని బట్టి నెలకు ఒక ట్రాక్టర్‌కు ఇంత అని తీసుకుంటున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఇచ్చేలా ఇసుకాసురులు ఎస్సైలు, సీఐలతో ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో ఒక్కో అధికారికి నెలకు రూ.50 వేల నుంచి రూ.8 లక్షల వరకు వాటాలు వెళ్తున్నాయి. ఇసుకాసురులు పోలీసుల సహకారంతో దర్జాగా దందా చేస్తూ చేస్తూ రూ.లక్షలలో కూడబెడుతున్నారు.

**లూప్‌లైన్‌కు పంపాలని ఉత్తర్వులు**
జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ఎస్సైలు, సీఐల జాబితాను సెప్టెంబర్ 4న డీజీపీ ఆఫీస్ నుంచి పంపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జాబితాలో ఇద్దరు సీఐలు, పది మంది ఎస్సైల పేర్లు ఉన్నాయి. వారిని లూప్‌లైన్‌కు పంపించాలని, ఎక్కడ ఎలాంటి పోస్టింగ్ ఇవ్వవద్దని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. నెలన్నర క్రితం జాబితా వచ్చినా సీపీ కల్మేశ్వర్ ఎస్సైలు, సీఐలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాగా డీజీపీ ఆఫీస్ నుంచి ఉత్తర్వులు రాక ముందు జిల్లాలో ఎస్సైల బదిలీలు జరిగాయి. మామూళ్లు తీసుకుంటున్న ఎస్సైలు కొందరు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. మరికొందరు జిల్లాలో లా అండ్ ఆర్డర్‌లో పని చేస్తున్నారు. డీజీపీ ఉత్తర్వుల మేరకు లూప్‌లైన్‌లో ఉండాల్సిన వారిని ఇంకా ప్రధాన విభాగాల్లో కొనసాగిస్తున్నారు. బోధన్ ఎస్‌హెచ్‌వో వీరయ్య ప్రస్తుతం ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్నారు. భీమ్‌గల్ సీఐగా పని చేసిన శ్రీనివాస్ బదిలీపై ఆర్మూర్ టౌన్ సీఐగా రాగా సీపీ కల్మేశ్వర్ జాయినింగ్ చేసుకోకపోవడంతో వేరే చోట పోస్టింగ్ తీసుకున్నారు.

**రాత్రివేళ తరలింపు..**
జిల్లాలోని జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, పోతంగల్, రుద్రూర్, వర్ని, బోధన్, సాలూరా, రెంజల్, భీమ్‌గల్, మాక్లూర్ మండలాల్లో ఇసుక దందా ఎక్కువగా సాగుతోంది. ఇక్కడ పని చేసే ఎస్సైలు, సీఐల కనుసన్నల్లో రాత్రివేళలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఆయా మండలాల్లో మంజీర నది, పెద్ద వాగు, ఇతర వాగులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రివేళ ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపి, నిజామాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడకు తమకు అనుకూలంగా ఉండే పోలీసులు వచ్చేలా రాజకీయ నాయకులతో సైతం మాట్లాడుతున్నట్లు సమాచారం. కొన్ని చోట్లు ఇసుక దందాలలో రాజకీయ నాయకుల ప్రమేయం కూడా ఉంది.

**ఇసుక అక్రమ రవాణాకు సహకరించిన పోలీసుల జాబితా**

| ఎస్సై | పోలీస్‌స్టేషన్ | నెలకు మామూళ్లు (ట్రాక్టర్‌కు..రూ.లో) |
|---|---|---|
| తిరుపతి | జక్రాన్‌పల్లి | 20 వేలు |
| మనోహర్ | ఇందల్వాయి | 10 వేలు |
| విక్రమ్ | ధర్పల్లి | 15 వేలు |
| రమేశ్ | సిరికొండ | 10 వేలు |
| సందీప్ | కోటగిరి | 10 వేలు |
| అప్పారావు | రుద్రూర్ | 10 వేలు-20 వేలు |
| కృష్ణ | వర్ని | 20 వేలు |
| సాయన్న | రెంజల్ | 10 వేలు |
| సుధీర్‌రావు | మాక్లూర్ | 10 వేలు |
| శ్రీనివాస్ | భీమ్‌గల్(సీఐ) | 70 వేలు |
| వీరయ్య | బోధన్‌టౌన్(సీఐ) | 50 వేలు |

బోధన్‌రూరల్ ఎస్సై నాగనాథ్ లంగ్డాపూర్, హంగర్గ గ్రామాల నుంచి రూ.6లక్షల నుంచి రూ.8లక్షల వరకు తీసుకున్నారు.

# రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో మార గంగారెడ్డి, మానాల మోహన్‌రెడ్డి

- షుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే తెరిపిస్తాం
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

సుభాష్‌నగర్: రైతుల శ్రేయస్సు కోసం పాటుపడినప్పుడే సహకార సంఘాల లక్ష్యం నెరవేరుతుందని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఎన్‌డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సొసైటీ చైర్మన్లు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాలు బలోపేతం కావాలంటే అధికారులు, పాలకవర్గాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సొసైటీలంటే ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయం మాత్రమే కాదన్నారు. సంఘాలు వ్యాపారాలు చేసి మరింత బలోపేతం కావాలన్నారు. త్వరలోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను సమకూర్చే పనిలో ప్రభుత్వం ఉందన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే తెరిపిస్తామని, దాదాపు రూ.200 కోట్ల వరకు బకాయిలను చెల్లించామని చెప్పారు. చెరుకు సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు.

**ఇతర వ్యాపారాలపై దృష్టి సారించాలి**
సొసైటీలు అభివృద్ధి చెందాలంటే ధాన్యం కొనుగోళ్ల మాత్రమే కాకుండా ఇతర వ్యాపారాలపై దృష్టి సారించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. చేపలు, కోళ్ల పెంపకం, పూలు, పాల విక్రయం వంటి వ్యాపారాలు చేస్తే లాభదాయకంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం తరఫున ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తామని హామీ ఇచ్చారు.

**కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు**
సహకార సంఘాల్లో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా నవంబర్ 30న హైదరాబాద్, వరంగల్ శిక్షణ కేంద్రాల్లో సొసైటీ కంప్యూటర్ ఆపరేటర్లకు కామన్ సర్వీసింగ్ సెంటర్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి సొసైటీ నుంచి కంప్యూటర్ ఆపరేటర్లను పంపించాలని, అందరం కలిసి సహకార రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఎండీ అన్నపూర్ణమ్మ, డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల ప్రయోజనాల కోసం పని చేస్తా

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



ఆర్మూర్: అధికార పార్టీ నాయకుడిగా పదవిలో ఉన్నా.. లేకున్నా రైతుల పక్షాన నిలిచి రైతు సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. 2019 నుంచి చేపట్టిన రైతు జేఏసీ చేపట్టిన ఉద్యమాలపై 'సాక్షి' దినపత్రికలో 'ఉద్యమ లక్ష్యం నెరవేరేనా..?' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై బుధవారం ఆయన స్పందించారు. రైతు బిడ్డగా రైతుల సమస్యలపైనే తాను ప్రధానంగా పోరాడతానన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్‌లో ఎర్రజొన్నలు, పసుపు పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు అంశాన్ని చేర్పించారన్నారు. అధికార పార్టీలో ఉన్నందుకు నేరుగా రైతు జేఏసీతో కలిసి పని చేయకున్నా రైతుల డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉంటానన్నారు. ఎర్రజొన్న, పసుపు పంటలు చేతికి వచ్చాక ధరల వ్యత్యాసాన్ని బట్టి ప్రభుత్వాన్ని ఒప్పించి గిట్టుబాటు ధర ఇప్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. రైతు ఉద్యమాల ఫలితంగా వచ్చిన ఈ పదవిని అన్నదాతల సమస్యలు పరిష్కరించడానికి ఉపయోగిస్తానని పేర్కొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి



దేగాం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

పెర్కిట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఆలూర్ మండలం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. పాముకాటుకు వినియోగించే యాంటీ వీనమ్ మెడిసిన్, ఆక్సిజన్ సిలిండర్లను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దేగాం పీహెచ్‌సీలో యంత్రాలతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న తరహాలో జిల్లా వ్యాప్తంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజశ్రీని ఆదేశించారు. అలాగే మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణకు ర్యాపిడ్ టెస్టు కిట్లు అందుబాటులో ఉన్నాయా లేవనే విషయాలను పీహెచ్‌సీ వైద్యులను ఆరా తీశారు. పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడాన్ని గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు.

# బాధ్యతలు స్వీకరించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజిరెడ్డి, చిత్రంలో ఎమెల్యే సుదర్శన్‌రెడ్డి, మానాల, తాహెర్, మండవ

నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ సిటీ: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బుధవారం అంతరెడ్డి రాజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో ఉదయం 11 గంటలకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం గోనేరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వేలాది ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. రాజారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్‌లో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లాలోని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, సీనియర్ నేతలు గడుగు గంగాధర్, అరికెల నర్సారెడ్డి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజొన్న సాగుపై అనాసక్తి

- తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- ధర, దిగుబడి పడిపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు



మోర్తాడ్‌లో సాగు చేసిన ఎర్రజొన్నలు (ఫైల్)

మోర్తాడ్: జిల్లాలో ఎర్రజొన్నల సాగు విస్తీర్ణం క్రమంగా తగ్గిపోతోంది. ఒకప్పుడు యాసంగి సీజన్‌లో ఎర్రజొన్నల సాగుకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన రైతులు ఇప్పుడు తమ ఆలోచనను మార్చుకున్నారు. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఎర్రజొన్నల సాగు జోరుగా సాగింది. ప్రతి సీజనులో దాదాపు 25వేల ఎకరాల్లో ఈ పంటను వేసేవారు. రెండు మూడేళ్లుగా ప్రతికూల పరిస్థితులతో ఎర్రజొన్నల సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎర్రజొన్నల ధర కోసం రైతులు ఐక్యంగా ఉద్యమించడంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు ఓటములపై తీవ్ర ప్రభావం చూపించారు. ఇలా ఎర్రజొన్నల పంట ఎంతో చరిత్రను సొంతం చేసుకోగా ఇప్పుడు చరిత్రలో ఒక పేజీలా మిగిలిపోనుంది.

**మొక్కజొన్న సాగుకు మొగ్గు**
వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఎర్రజొన్నల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. గతంలో ఎకరానికి 20 క్వింటాళ్ల దిగుబడి లభించగా ఇప్పుడు 12 క్వింటాళ్లకే పరిమితమైంది. గతంలో ధర రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పలికితే కొంత కాలం నుంచి రూ.3వేలకే పరిమితమైంది. దిగుబడి తగ్గిపోవడం, ధర లేకపోవడం, బైబ్యాక్ ఒప్పందాన్ని వ్యాపారులు ఉల్లంఘించడం ఇతరత్రా కారణాలతో ఎర్రజొన్నల సాగుకు గడ్డు కాలం ఏర్పడింది. ప్రత్యామ్నయంగా తెల్లజొన్నలు, మొక్కజొన్న సాగుకే రైతులు మొగ్గుచూపుతున్నారు. గత సీజనులో సాగు చేసిన ఎర్రజొన్నల నిలువ తమ గోదాంలలో అలాగే ఉండిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. ఎవరైన ఎర్రజొన్నలను సాగు చేయాలనుకుంటే సొంతంగానే విత్తనాలను సేకరించుకోవాలని, తాము విత్తనాలు విక్రయించినా పంటను కొనుగోలు చేయడం, ధర ఒప్పందానికి సానుకూలంగా లేమని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ఈ సీజనులో ఎర్రజొన్నల సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు.

**సాగు తగ్గిపోయింది**



ఈ ప్రాంతంలో వివిధ కారణాలతో ఎర్రజొన్నల సాగు పూర్తిగా తగ్గిపోయింది. మొక్కజొన్నతో పాటు అక్కడక్కడ తెల్లజొన్నల సాగుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేకుండా ఉంది.
– గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

## నగరంలో 'పొట్టేల్' యూనిట్ సందడి

నిజామాబాద్ రూరల్: నగరంలో బుధవారం పొట్టేల్ చిత్ర యూనిట్ సందడి చేసింది. దేవీ థియేటర్‌లో సినిమా హీరోయిన్ అనన్య, హీరో యువచంద్ర మాట్లాడారు. ఈ నెల 25న విడుదలవుతున్న సినిమాను చూడాలని కోరారు. అభిమానులతో కలిసి వారు డ్యాన్స్ చేశారు. థియేటర్ ప్రొపరేటర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న జాటోతు హుస్సేన్ నాయక్

ఇందల్వాయి: మండలంలోని మాక్లూర్ తండా వద్ద ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్ మెంబర్ జాటోతు హుస్సేన్ నాయక్ బుధవారం తనిఖీ చేశారు. మూడు గంటల పాటు ఆయన పాఠశాలలో గడిపి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. మరుగుదొడ్లు, వంటగది, తరగతి గదులు, ఆటస్థలాన్ని పరిశీలించి, సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, ఆట స్థలం అపరిశుభ్రంగా ఉన్నాయని, ఇంటర్నెట్, మి నరల్ వాటర్ సౌకర్యం లేదని బాధ్యులపై చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ ను ఆదేశించారు. మోడల్ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోవాలన్నారు. సిబ్బంది గైర్హాజరు, విద్యార్థుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీడీవోలు నాగోరావు, రజిత, ఆర్‌సీవో గంగారాంనాయక్, డీసీవో సోమ్లానాయక్, ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, తహసీల్దార్ వెంకట్ రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఉన్నారు.

## క్లుప్తంగా

### సైబర్ మోసాలకు గురికావొద్దు



ఆర్మూర్ టౌన్: విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో వచ్చే అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేసి సైబర్ మోసాలకు గురికావొద్దని సైబర్ క్రైం డీఎస్పీ వై వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ క్రైం, సైబర్ సేఫ్టీ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో టెక్నాలజీ భాగమైన నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైం వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు కృషి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో వసతుల కల్పనకు కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. నియోజకవర్గంలో దాదాపు 59 సెంటర్‌లలో మౌలిక వసతులు సరిగ్గా లేవన్నారు. గర్భిణులకు, పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ టీచర్లది కీలక పాత్ర అని గుర్తు చేశారు. మహిళలు, పిల్లల హక్కులు కాపాడటంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వవద్దని అన్నారు. అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిర్లక్ష్యం చేస్తే ఊరుకోనని హెచ్చరించారు.

### సెలవులో ఉండి వేతనం పొందిన ఉద్యోగి

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో సెలవులో ఉన్న ఓ ఉద్యోగి మూడు నెలలపాటు వేతనం పొందాడు. ఈ విషయం వెలుగులోకి రావడంతో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ విచారణ చేపడుతున్నారు. శ్రీనివాస్ అనే సీనియర్ అసిస్టెంట్ గతేడాది ధర్పల్లి పాఠశాలకు బదిలీ అయ్యాడు. బదిలీ అనంతరం మూడు నెలలపాటు సెలవుల్లో వెళ్లినప్పటికీ మూడు నెలలపాటు వేతనం పూర్తిస్థాయిలో మంజూరైంది. సంబంధిత అధికారి ఈ విషయం బయటకు పొక్కకుండా మూడు నెలల వేతనాన్ని రికవరీ చేసి విద్యాశాఖకు జమ చేశాడు. ప్రస్తుతం విషయం బయటికి పొక్కడంతో డీఈవో విచారణ చేపడుతున్నారు.

### కొండ చిలువను చంపిన రైతులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్లతండా శివారులోని పంట చేనులో బుధవారం రైతులు భారీ కొండ చిలువను చంపారు. తండాకు చెందిన రూప్‌సింగ్ తన వ్యవసాయభూమిలో వరి కోస్తుండగా భారీ కొండ చిలువ ఎదురుగా వచ్చింది. దీంతో భయాందోళనకు గురైన రైతులు వెంటనే కర్రలతో కొట్టి చంపారు.

# ఐక్యతతో ఆనందం

- ఆదర్శంగా నిలుస్తున్న పోచారం తండా – రాంపూర్ తండావాసులు
- ఆపదలో ఉన్న వారికి అండగా..
- తండాల అభివృద్ధి, ఉద్యోగాల సాధనలోనూ ముందంజ



రాంపూర్ తండా ముఖచిత్రం

బాన్సువాడ రూరల్: ఐక్యమత్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మండలంలోని పోచారం – చిన్నరాంపూర్ తండా వాసులు నిలుస్తున్నారు. రెండు తండాలకు చెందిన ఏ ఒక్కరూ ఆపదలో ఉన్నా మిగతా వారంతా ఒక్కటై బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. పోచారం తండా, రాంపూర్ తండాల గ్రామ పంచాయతీలు వేర్వేరు అయినప్పటికీ ఒకే నాయక్, కారోబార్ పరిధిలో అన్నాదమ్ముళ్లలా జీవిస్తున్నారు. పోచారం తండా, రాంపూర్ తండాల పరిధిలో 210 కుటుంబాలు ఉండగా, 1100 జనాభా ఉంది. రెండు తండాల్లో కలిపి సుమారు 80 మంది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇక ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. అభివృద్ధిలోనూ, ఇటు ఆపదలో ఉన్న వారిని ఆదుకునే విషయంలోనూ ఐక్యంగా ఉంటున్నారు. విరాళాలు పోగుచేసి సంత్ సేవాలాల్, జగదాంబ దేవీ మాత ఆలయాలను ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించారు. మందిరాల వరకు సీసీరోడ్డు వేయించారు. అంతకు ముందే హనుమాన్ ఆలయాన్ని నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం కోసం వందలాది మొక్కలు తెప్పించి నాటించారు. దీంతో తండాలో ఆధ్యాత్మిక శోభతోపాటు, పచ్చదనం సంతరించుకుంది. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, గణేశ్ చవితి, హోళీ తదితర పండుగలతోపాటు తండాలో తీజ్ ఉత్సవాలను జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఘనంగా నిర్వహిస్తారు.

## 15 ఏళ్ల క్రితమే సేవా బీజం..

15ఏళ్ల క్రితం తండాకు చెందిన ఓ యువకుడు పాముకాటుకు గురై ఆస్పత్రిలో చేరాడు. మరికొన్ని రోజుల్లో పెళ్లి చేసుకునే యువకుడు ఆస్పత్రిలో చేరడం తండావాసులను కలిచివేసింది. ఇంటింటికీ చందాలు పోగుచేసి ఆస్పత్రి ఖర్చులు భరించి యువకుడి ప్రాణాలు కాపాడారు. నాటి నుంచి ఏ ఒక్కరికి ఆపదవచ్చినా మిగతా వారందరూ ఆదుకునేందుకు ముందుకు వస్తున్నారు. గతేడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చేరిన పేద విద్యార్థి కోసం రూ.80వేల విరాళాలు సేకరించి వైద్య ఖర్చులను భరించారు. పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. తండాలో ఎవరికి సమస్య వచ్చినా పేద, ధనిక తేడా లేకుండా తోచిన సాయం అందించేందుకు సిద్ధమవుతున్న పోచారం – రాంపూర్ తండావాసులను పలువురు అభినందిస్తున్నారు.



బానోత్ విజయ్

ఈ ఫొటోలో కనిపిస్తున్న యువకుడి పేరు బానోత్ విజయ్. ఇటీవల తీవ్ర తలనొప్పితో ఆస్పత్రిలో చేరగా మెదడులో రక్తస్రావమవుతోంది వైద్యానికి సుమారు రూ.2లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఐసీయూలో ఉన్న విజయ్.. తన పరిస్థితిని వివరిస్తూ రాంపూర్ తండా వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టాడు. నిమిషాల్లోనే పేద, ధనిక లేకుండా తండా వాసులు స్పందించి రూ.లక్షా 20వేలు విరాళాలు పోగుచేసి అందించడంతో విజయ్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. తనకు పునర్జన్మనిచ్చి తండావాసులకు రుణపడి ఉంటానని, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుంటానని విజయ్ అంటున్నాడు.

### ఎవరికి ఆపదొచ్చినా ఆదుకుంటాం



2008లో మేము జగదాంబ మాత, సంత్‌సేవాలాల్ మందిరాన్ని నిర్మించాం. నాటినుంచి చాలామందికి ఉద్యోగాలు వచ్చాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. పోచారం – రాంపూర్ తండావాసులమంతా ఐక్యంగా ఉంటూ ఎవరికి ఏ ఆపద వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇస్తూ ఆదుకుంటున్నాం.

– రాములురాథోడ్, తండావాసి

### కష్టసుఖాల్లో ఒక్కటిగా ఉంటాం



తండావాసులమంతా కష్టసుఖాల్లో ఒక్కటిగా ఉంటాం. మంచైనాచెడైనా పాలుపంచుకుంటాం. ఏ సమస్య వచ్చి నా ఉద్యోగులు, యువకుల సహకారంతో పరిష్కరించుకుంటున్నాం. అందరి సహకారంతో సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తాం. చుట్టుపక్కల గ్రామాల్లోనూ చైతన్యం వస్తే బాగుంటుంది.

– ఫకీరానాయక్, తండావాసి

### వ్యవసాయం, విద్యలో ఆదర్శం



ఆపదలో ఆదుకునే విషయంలో, అభివృద్ధి, వ్యవసాయం, విద్యలోనూ తండావాసులు ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ పిల్లలను మంచి మంచి విద్యాసంస్థల్లో చదివిస్తున్నారు. సేవాలాల్ మహరాజ్ కృపతో మా జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయి.

– బానోత్ హరిసింగ్, మాజీ వైస్ ఎంపీపీ

### రాష్ట్రస్థాయికి తైక్వాండో క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి వివిధ కేటగిరిల్లో తైక్వాండో క్రీడాకారులను బుధవారం ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగమణి తెలిపారు. అండర్ – 14, అండర్ – 17 (బాలుర–బాలికల) విభాగాల్లో తైక్వాండో క్రీడాకారులను ఎంపిక చేయగా, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి 150 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. క్యూరియస్ తైక్వాండో అకాడమీకి చెందిన 11 మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. అండర్ – 17 బాలుర విభాగంలో హరీశ్ పాండ్రే, శౌర్య శ్రీవాస్తవ, ఉదిత్ సాయి, యశస్వి, అజాన్‌ఖాన్ ఎంపిక కాగా, అండర్ – 17 బాలికల విభాగంలో అస్మిత, దు ర్గాశ్రీ ఎంపికయ్యారు. అండర్ – 14 కేటగిరి నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యా రు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 23 నుంచి 25వ తేదీ వరకు గద్వాలలో నిర్వహించే రాష్ట్ర ఎస్‌జీఎఫ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినోద్‌నాయక్, అధ్యక్షుడు ప్రవీణ్, కోశాధికారి వినోద్ తెలిపారు.

### రేషన్ డీలర్ల పరీక్ష ఫలితాలు వెల్లడి

బోధన్: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఖాళీగా ఉన్న 18 రేషన్ దుకాణాలకు డీలర్ల నియామకం కోసం సెప్టెంబర్ 26న రాత పరీక్ష నిర్వహించి విషయం తెలిసిందే. ప్రతి దుకాణానికి సంబంధించిన మొదటి ఐదు స్థానాల్లో మార్కులు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి ఈ నెల 15 నుంచి 17 వరకు వరుసగా మూడు రోజులపాటు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బుధవారం పరీక్షాఫలితాలు వెల్లడించినట్లు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తెలిపారు. వివరాల కోసం తన కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

# వ్యవసాయక్షేత్రం సందర్శన



వరిని పరిశీలిస్తున్న విద్యార్థులు

నిజామాబాద్ రూరల్: కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రుద్రూర్ విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రాక్టికల్స్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. గూపన్‌పల్లి శివారులోని చిన్నికృష్ణుడి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం ఈ సందర్భంగా చిన్నికృష్ణుడు రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం చేసే వివిధ రకాల పద్ధతులను విద్యార్థులకు వివరించారు. అలాగే వివిధ రకాల ప్రకృతి వరి వంగడాల గురించి విద్యార్థులు తెలుసుకున్నారు.

### కుక్కలు, కోతుల దాడిలో పలువురికి గాయాలు



కోతి దాడి చేయడంతో యువకుడి చేతిపై గాయం ,కుక్క దాడిలో గాయపడిన మరో యువకుడు

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రవాసులను కుక్కలు, కోతులు బెంబేలెత్తిస్తున్నాయి . బుధవారం ఓ యువకుడిపై కోతి దాడి చేయగా, మరో యువకుడిని కుక్క కరిచింది. ఓ లేగ దూడపై కుక్క దాడి చేయగా చికిత్స పొందుతూ దూడ మృతి చెందింది. ఒకే రోజు మూడు ఘటనలు జరగడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఉద్యోగి జీవితంలో క్రీడలతో కొత్తదనం



టగ్ ఆఫ్ వార్‌ను ప్రారంభిస్తున్న అదనపు డీసీపీ



విజేతలతో అదనపు డీసీపీ కోటేశ్వరరావు

- అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వరరావు
- ముగిసిన స్పోర్ట్స్ మీట్ – 2024

ఎడపల్లి (బోధన్): ఉద్యోగి జీవితంలో క్రీడలతో కొత్తదనం కనిపిస్తుందని, ఉత్తమ క్రీడాకారులను గుర్తిస్తామని డీసీపీ కోటేశ్వర్‌రావు అన్నారు. జానకంపేట శివారులోని పోలీసు శిక్షణ కేంద్రంలో రెండు రోజులపాటు కొనసాగిన 'స్పోర్ట్స్ మీట్ – 2024' బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీటీసీ ప్రిన్సిపాల్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బి.కోటేశ్వరరావు హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సీటీసీ ఏసీపీ (వైస్ ప్రిన్సిపాల్) మస్తాన్ అలీ, ఏఆర్ ఏసీపీ నాగయ్య, బోధన్ ఏసీపీ పి శ్రీనివాస్, సీఐ శివరాం , ఆర్ఐ శ్రీపాల్, రిజర్వ్ సీఐ, ఆర్ఎస్సైలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న అదనపు డీసీపీ కోటేశ్వరరావు

## క్రైం కార్నర్

# మూడు కిలోల గంజాయి పట్టివేత

### బోధన్‌లో 2 కిలోలు..



బోధన్‌లో..

బోధన్: పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటిక వద్ద నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు ఇద్దరు నిందితుల నుంచి 2 కిలో 50 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం బైపాస్ రోడ్డులో నిఘా పెట్టి ఇద్దరు అనుమానితులు షేక్‌బాబర్ మియా, గుర్రాల శంకర్‌ను తనిఖీ చేయగా, వారి వద్ద ఎండు గంజాయి లభించింది. గంజాయితోపాటు మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు.

### నిజామాబాద్‌లో కిలో..



నిజామాబాద్‌లో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి, కే మల్లారెడ్డి ఆదేశాలకు మేరకు ఎస్‌హెచ్‌వో టీమ్ నాగారం చౌరస్తాలోని హనుమాన్ మందిరం వెనుక ప్రాంతంలో తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో యాక్టివాలో 1.110 కిలోల గంజాయి తరలిస్తూ నాగారంలోని 80 క్వార్టర్స్‌కు చెందిన సాజీద్ అలీ పట్టుబడినట్లు ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. సాజీద్ అలీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. తనిఖీల్లో నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్సై టి.సుష్మిత, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, ధారిసింగ్, సునీల్, నిసార్ మియా పాల్గొన్నారు.

### తప్పిన ప్రమాదం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా ప్రాంతంలో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుత్ విద్యుత్ స్తంభం విరిగిపడింది. స్తంభం విరిగిపడిన సమయంలో చుట్టుపక్కల జనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### రెస్టారెంట్ల తనిఖీ



హోటల్‌ను తనిఖీ చేస్తున్న శానిటరి ఎస్సై

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు బుధవారం తనిఖీ చేపట్టారు. పరిశుభ్రత లేని హోటళ్లను, ప్లాస్టిక్ వినియోగిస్తున్న యజమానులపై జరిమాన విధించినట్లు శానిటరి ఎస్సై గజానంద్ తెలిపారు. హోటల్ నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలు దుకాణదారులకు జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది అర్జున్, అక్షయ్, రాము, నర్సయ్య ఉన్నారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

**PASSPORT MISSING**

■ నేను మహమ్మద్ అఫ్రోజ్ హుస్సేన్ S/o. మహమ్మద్ జాకీర్ హుస్సేన్ గ్రా॥ అడ్లూర్ ఎల్లారెడ్డి, జిల్లా: కామారెడ్డి. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. P8043249, తేది: 20/09/2024 రోజున ఇల్లు మారుస్తుండగా పోయినది. దొరికినయెడల సం॥ 7680891263.
[Z-1080830]

■ KHANRA SANDIP KUMAR S/o. KHANRA NEMAI ఆర్మూర్ ఇ.నెం. 1-8-38/24 ఆర్మూర్ నుండి నిజామాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా E6039139 పాస్‌పోర్ట్ పోయినది. దొరికినయెడల సం॥ 9030856473.
[Z-1203556]

**CHANGE OF NAME**

■ I, GANGAMANI MADGULA D/o. GANGARAM (Old Name) Changed my Name as KUDALA LATHA, W/o. KUDALA RAJU (New Name) R/o. 3-108/1, Vill: Lakhora, Mdl: Velpoor, Nizamabad. (T.G.)
[Z-1203650]

**WANTED**

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.
[M-1185491]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899.
[HA-1381]

■ నిజామాబాద్‌లో టిఫిన్ సెంటర్ కొరకు అనుభవం ఉన్న మాస్టర్ కావాలి. 9440965007
[HA-05423]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


### తమ్ముడిని చంపిన అన్నకు ఐదేళ్ల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: తమ్ముడిని చంపిన అన్నకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నస్రుల్లాబాద్‌కు చెందిన అల్లం మధుకర్‌కు ప్రభాకర్, శివకుమార్ ఇద్దరు కుమారులు. మద్యానికి బానిసైన ప్రభాకర్ డబ్బుల కోసం తరచూ తన తమ్ముడు శివకుమార్‌ను వేధించేవాడు. ఇరువురి మధ్య డబ్బుల విషయంలో గొడవలు జరిగేవి. డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో ప్రభాకర్ 2022 అక్టోబర్ 1న తమ్ముడిని కర్రతో కొట్టి చంపాడు. అప్పట్లో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ నిందితుడు ప్రభాకర్‌కు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.5వేల జరిమాన విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. కేసు దర్యాప్తు, సాక్షాల సమర్పణలో కీలకంగా వ్యవహరించిన బాన్సువాడ సీఐలు చంద్రశేఖర్, రాజేశ్, ఎస్సైలు రంజిత్, వెంకట్‌రావు, పీపీ దామోదర్‌రెడ్డి, లైజనింగ్ అధికారి ఎస్సై మురళి, సిబ్బంది కిషన్, సలేశ్‌ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

### తండ్రిని చంపిన తనయుడి రిమాండ్

నవీపేట: మండలంలోని అనంతగిరికి చెందిన గౌరు అమృతంను హత్య చేసిన కేసులో అతడి తనయుడు గౌరు మహిపాల్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై వినయ్ తెలిపారు. దుబాయి నుంచి స్వగ్రామానికి వచ్చిన మహిపాల్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని తండ్రిపై కోపాన్ని పెంచుకున్నాడని, పథకం ప్రకారం అతడిని హత్య చేశాడని తెలిపారు. మృతుడి సోదరి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

### పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం పోలీసులు పేకాటస్థావరాలపై దాడి చేశారు.

తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.20,170 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

# తాళం వేసిన ఇళ్లలో చోరీ



బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- కామారెడ్డిలో 37 తులాల బంగారు ఆభరణాల అపహరణ
- మోర్తాడ్‌లో రెండు తులాల బంగారం, పది తులాల వెండి..

కామారెడ్డి క్రైం: తాళం వేసిన ఇంట్లో దుండుగులు చోరీకి పాల్పడి 37 తులాల బంగారు ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

పట్టణంలోని పీఎంహెచ్ కాలనీకి చెందిన అర్నె యోగేశ్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 21న ఇంటికి తాళం వేసి వరంగల్‌కు వెళ్లాడు. 22న సాయంత్రం 6:30 గంటలకు యోగేశ్‌కు బంధువులు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. హుటాహుటిన బయల్దేరి ఇంటికి వచ్చిన యోగేశ్ దుండుగులు చోరీకి పాల్పడినట్లు గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 37 తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘటనాస్థలాన్ని కామారెడ్డి ఎస్డీపీవో నాగేశ్వరరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ సిబ్బంది, కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది పరిశీలించారు. చుట్టుపక్కల ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు దుండగుల కోసం గాలిస్తున్నారు.

**మోర్తాడ్‌లో..**

మోర్తాడ్(బాల్కొండ): మండల కేంద్రానికి చెందిన ఆరేటి వినయ్ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని మంగళవారం రాత్రి దుండగులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువా తాళాలు పగుల గొట్టి రెండు తులాల బంగారం, 10 తులాల వెండి సామగ్రితోపాటు కొంత నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై విక్రమ్ క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### డెంగీపై అవగాహన



డిచ్‌పల్లి: మండలంలోని యానంపల్లిలో డెంగీ వ్యాధిపై మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై శంకర్ బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాతీయ కీటక జనిత వ్యాధులైన దోమల ద్వారా సంభవించే మలేరియా ఫైలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి వ్యాధులను రాకుండా ఉండాలంటే దోమలు పెరగకుండా చూడాలని ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించాలన్నారు. మంచినీటిలో నివసించే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమతో డెంగీ వ్యాధి సోకుతుందని, మంచినీటి కుండీల్లో లార్వా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆశాకార్యకర్తలు ప్రతి మంగళ, శుక్రవారం ఇంటింటికి తిరిగి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. నీటి నిల్వ గల ప్రాంతాలను గుర్తించి గ్రామకార్యదర్శికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చరణ్‌రాజ్, ఆరోగ్య సిబ్బంది గంగుబాయి, వెంకటరెడ్డి, ఆశా కార్యకర్తలు నిరోషా, మంజుల తదితరులు పాల్గొన్నారు.